పలు కుటుంబాలకు 'కందాళ' పరామర్శ

నర్సింహారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కందాళ

కూసుమంచి, జూలై 30: పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి కూసుమంచి మండలంలో శుక్రవారం పర్యటించారు. జుర్రుల్‌రావుపేట, రాజుపేట గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను పరామర్శించారు. జుర్రుల్‌రావుపేటలో నాగండ్ల నర్సింహారావు మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను కలిసి సంతాపం తెలిపారు .రాజుపేటలో సోలీపురం దుర్గమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు వేముల వీరయ్య, ఆసీఫ్‌పాషా, ఇంటూరి శేఖర్, ఉన్నం బ్రహ్మయ్య, వాసంశెట్టి వెంకటేశ్వర్లు, బజ్జూరి రాంరెడ్డి, అలివేలు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు జడ్పీ చైర్మన్ పరామర్శ

మధిర, జూలై 30: మధిర 20వ వార్డు బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ వేముల శ్రీనును జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు పరామర్శించారు. ఇటీవల అతడు అనారోగ్యంతో ఉండడంతో మంగళవారం అతడి ఇంటికి వెళ్లిన జడ్పీ చైర్మన్.. అతడిని ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు అరిగె శ్రీనివాసరావు, యన్నంశెట్టి అప్పారావు, నాగులవంచ రామారావు, ముత్తవరపు ప్యారీ, కోలకొండ, చీదురాల రాంబాబు, మందడపు రామకృష్ణ పాల్గొన్నారు.

వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ పరిశీలన

మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఖమ్మం నగర కమిషనర్ అభిషేక్ అగస్త్య

రఘునాథపాలెం, జూలై 30: ఖమ్మం నగరం 54వ డివిజన్ పరిధిలోని వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను మంగళవారం నగరపాలక కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. మార్కెట్ పనివేళలను ఈవో శ్వేతను అడిగి తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న షాపులను ఉపయోగించే విధానంపై చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక కార్పొరేటర్ పాల్గొన్నారు.

'పరిచయం లేని వ్యక్తులను పిల్లలు నమ్మొద్దు'

బోనకల్లు, జూలై 30: పరిచయం లేని వ్యక్తులను నమ్మవద్దని జానకీపురం హైస్కూల్ హెచ్‌ఎం హేమమాలిని.. విద్యార్థులకు సూచించారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎఫర్ట్ సంస్థ, చైల్డ్ రైట్స్ అండ్ యు సంస్థ సంయుక్త సహకారంతో మండలంలోని పలు పాఠశాలల్లోని విద్యార్థులకు, కమ్యూనిటీల్లో ఉన్న ప్రజలకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. తెలియని వ్యక్తులు పిల్లలను ప్రలోభపెట్టడం వంటి విషయాలను గమనిస్తే తక్షణ సహాయం కోసం పోలీసు హెల్ప్‌లైన్ 100కు గానీ, చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098కు గానీ కాల్ చేయాలని సూచించారు.

బాలుడిని కరిచిన వీధి కుక్క

ముదిగొండ, జూలై 30: ఆరేళ్ల బాలుడిపై వీధి కుక్క దాడి చేసిన ఘటన ముదిగొండ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని అమ్మపేట గ్రామానికి చెందిన మోదుగుల వరుణ్‌తేజ్ అనే బాలుడు గ్రామంలోని పాఠశాలకు వెళ్తున్నాడు. ఆ సమయంలో రోడ్డు వెంట ఉన్న వీధి కుక్క ఒక్కసారిగా వరుణ్‌పై దాడి చేసింది. మోకాలి మడమ వద్ద కరిచింది. స్థానికులు కుక్క భారి నుంచి బాలుడిని కాపాడి ఆసుపత్రికి తీసుకెళ్లారు.

డిగ్రీలో చేరేందుకు చివరి అవకాశం

మధిర, జూలై 30: దోస్త్ స్పెషల్ ఫేజ్ గడువు ఆగస్టు 2 వరకే ఉందని, డిగ్రీలో చేరేందుకు ఇదే చివరి అవకాశమని మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏఎల్‌ఎన్ శాస్త్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో ఈ సంవత్సరం నుంచి సైన్స్ గ్రూపులు కూడా ప్రారంభమైనట్లు చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్ల కోసం కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ జీ.అరుణను సంప్రదించాలని అన్నారు. మరిన్ని వివరాల కోసం 9441786508, 9951184349 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఛిద్రమైన కుటుంబం

తల్లీకుమార్తెకు తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం..

వేంసూరు, జూలై 30: విద్యుదాఘాతంతో ఓ కుటుంబం ఛిద్రమైన ఘటన వేంసూరు మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వేంసూరు మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన చుక్క హరిబాబు, అతడి భార్య రోజా కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తూ ఇంట్లో విద్యుదాఘాతం కావడంతో మంటలు వ్యాపించాయి. కొడుకు విష్ణు హరిబాబు గమనించాడు. వెంటనే తేరుకొని ఇంటిలో నుంచి బయటకు వచ్చి విద్యుత్ కనెక్షన్‌ను తీసివేశాడు. కానీ అప్పటికే షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో ఉన్న రిఫ్రిజిరేటర్, బీరువా, ఇతర ఎలక్ట్రికల్ పరికరాలు పేలిపోయాయి. దీంతో ఇంట్లో ఉన్న తల్లికి రోజాకు, కుమార్తె వైష్ణవికి తీవ్ర గాయాలయ్యాయి. అంతా క్షణకాలంలో జరిగిపోయింది. తీవ్రంగా గాయపడిన రోజా, వైష్ణవిలను గ్రామస్తులు ప్రైవేటు వాహనంలో తిరువూరు తరలించారు. తరువాత మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ గాంధీ ఆసుప్రతికి తీసుకెళ్లారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ రాజు, ఎంపీడీవో రమాదేవి, ఎస్సై వీరప్రసాద్, ఆర్ఐ చిరంజీవి పరిశీలించారు.

విధుల్లో చేరిన 'భగీరథ' సిబ్బంది

2 రోజుల్లో వేతనాలు చెల్లిస్తామంటూ కాంట్రాక్టర్ హామీ

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

ఖమ్మం రూరల్, జూలై 30: రెండు రోజుల విధుల బహిష్కరణ అనంతరం మిషన్ భగీరథ ప్రాజెక్టు పంపు ఆపరేటర్లు ఎట్టకేలకు మంగళవారం సాయంత్రం తిరిగి విధుల్లో చేరారు. నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో మండలంలోని 21 మంది పంపు ఆపరేటర్లు ఆదివారం నుంచి విధులు బహిష్కరించి నిరసనకు దిగిన విషయం విదితమే. దీంతో రెండురోజుల నుంచి మండలంలోని 37 హ్యాబిటేషన్లలో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో అటు ప్రజలు, ఇటు పంపు ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ 'నిలిచిపోయినభగీరథ నీటి సరఫరా' శీర్షికన బుధవారం నాడు 'నమస్తే తెలంగాణ' ఓ కథనాన్ని ప్రచురించిన విషయం విదితమే. ఈ కథనంపై జిల్లాతోపాటు రాష్ట్రంలోనూ చర్చ జరిగింది. దీంతో మిషన్ భగీరథ కాంట్రాక్టర్ దిగిరాక తప్పని సరిస్థితి నెలకొంది. రెండు రోజుల్లో పెండింగ్ వేతనాలు చెల్లిస్తామని, తిరిగి విధుల్లోకి చేరాలని కార్మికులను ఆయన కోరారు. ఆ మేరకు హామీ ఇచ్చారు. దీంతో వారు మంగళవారం సాయంత్రం నుంచి 21 మంది పంపు ఆపరేటర్లు విధుల్లో చేరారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మామిళ్లగూడెం, జూలై 30: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే మహిళాశక్తి పథకం ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మంగళవారం టేకులపల్లిలోని మహిళా ప్రాంగణంలో మహిళా సమాఖ్యలకు నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సదస్సులో మహిళాశక్తి కార్యక్రమం, స్త్రీ, వైద్య, ఆరోగ్య సమస్యలు, స్త్రీ, శిశు సంక్షేమ కార్యక్రమాలు, జీవనోపాధులు, బ్యాంక్ లింకేజ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పురోగతి తదితరుల అంశాల పట్ల అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా పలు రకాల పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా సంఘంలోని గ్రూపు సభ్యులందరూ సమన్వయంతో కృషి చేసి అభివృద్ధి సాధించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల మిగులు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. నిధుల కొరత లేదని, పూర్తయిన పనులకు వెంటనే చెల్లింపులు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ మాలతి, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, ఎల్డీఎం శ్రీనివాసరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి, అదనపు డీఆర్డీవో నూరొద్దీన్, మహిళా ప్రాంగణం అధికారి విజేత, గౌతమి జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు టి.సుహాసిని, అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కేజీఎంసీ విద్యార్థులకు పరీక్షలు

ఖమ్మం సిటీ, జులై 30 : ఖమ్మం గవర్నమెంట్ మెడికల్ కాలేజ్‌కు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఆగస్టు 1వ తేదీ నుంచి వార్షిక పరీక్షలు జరుగబోతున్నాయి. ఈ మేరకు విద్యార్థులందరికీ పూర్తి వివరాలు తెలియజేసినట్లు సంబంధిత మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు మంగళవారం వెల్లడించారు. గత ఏడాదికాలంగా వారందరినీ పరీక్షలకు సన్నద్ధం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా జాతీయస్థాయిలో మెడికల్ విద్యార్థులకు ఎన్‌ఎంసీ కౌన్సిలింగ్ పూర్తి చేసిన దృష్ట్యా వచ్చే నెల 14వ తేదీ నుంచి మొదటి సంవత్సరంలో చేరగోరే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నామన్నారు. వారంతా 25వ తేదీలోపు ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రవేశాలు పొందుతారని, సెప్టెంబర్ 1 నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. కాగా.. ప్రస్తుతం ప్రథమ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉదయంపూట జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో ప్రాక్టీస్ చేస్తారని, వివిధరకాల వైద్య సేవల్లో శిక్షణ పొంది, మధ్యాహ్నం నుంచి తరగతులకు హాజరుకానున్నారు.

వైద్యులు రావడం లేదు...

ఖమ్మం జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో వైద్యుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ వెలువరించిన సంగతి అందరికీ తెలిసిందే. అధికారిక లెక్కల ప్రకారం ప్రొఫెసర్స్-7, అసోసియేట్ ప్రొఫెసర్స్- 12, అసిస్టెంట్ ప్రొఫెసర్స్- 8 కలిపి మొత్తం 27 పోస్టులను వాక్ ఇంటర్వ్యూ పద్ధతిలో మంగళవారం భర్తీ చేయాలని చూశారు. కానీ.. వాటి పట్ల వైద్యులు అనాసక్తిని ప్రదర్శించారు. కేవలం నలుగురు మాత్రమే (ఈఎన్‌టీ-1, మైక్రోబయాలజీ-1, డెంటల్-1, జనరల్ మెడిసిన్-1) హాజరవ్వగా వారికి నియామకపత్రాలను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్ అందజేశారు. మిగతా పోస్టుల్లో చేరేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వైద్యాధికారులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. దీనికి ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో అత్యధిక వేతనాలు అందజేయడం, సర్కారులో తక్కువ చెల్లించడమే ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ఇప్పటికైనా వేతన ఒప్పందాల్లో మార్పులు తీసుకువస్తేనే ఖాళీల భర్తీ సజావుగా కొనసాగుతుందని వారు భావిస్తున్నారు.

కేంద్ర బృందానికి జడ్పీ చైర్మన్ సన్మానం

కేంద్ర బృంద ప్రతినిధులతో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మధిర రూరల్, జూలై 30: మండలంలోని పలు పంచాయతీల్లో జరిగిన అభివృద్ధిపై అధ్యయనం చేసేందుకు వచ్చిన కేంద్ర బృందాన్ని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మంగళవారం సన్మానించారు. అనంతరం గత కేసీఆర్ ప్రభుత్వ పాలనలో గ్రామ పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి గురించి కేంద్ర బృందానికి జడ్పీ చైర్మన్ వివరించారు. ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న మహిళా కండక్టర్

మధిర, జూలై 30: మధిర డిపోకు చెందిన ఓ మహిళా కండక్టర్ నిజాయితీని, బాధ్యతను చాటుకుంది. మధిర డిపోకు చెందిన ఓ ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు మధిర నుంచి మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు బయలుదేరింది. నార్కట్‌పల్లి బస్టాండ్‌లో లత అనే ప్రయాణికురాలు హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు ఎక్కింది. హైదరాబాద్ దిల్‌షుక్‌నగర్‌లో దిగిపోయింది. నగదుతో కూడిన పర్సును ఆ బస్సులో మర్చిపోయింది. ఆ బస్సు కండక్టర్ పత్తేపరపు అనూష.. బస్సులో సీటు కింద పడి ఉన్న పర్సును గమనించింది. పర్సును తీసుకొని హైదరాబాద్ సీబీఎస్ ఆర్టీసీ అధికారులకు అప్పగించింది. వారు ఆ పర్సును పరిశీలించి ఆధార్‌కార్డు, రూ.6,750 నగదు ఉన్నట్లు గుర్తించారు. ఆధార్‌కార్డు ఆధారంగా సదరు ప్రయాణికురాలు లతకు సమాచారం ఇచ్చారు. ఆమె హైదరాబాద్ రావడంతో ఆ పర్సును ఆమెకు అందజేశారు.

సిరిపురంలో దొంగల హల్‌చల్

మధిర రూరల్, జూలై 30: మండలంలోని సిరిపురం గ్రామంలో సోమవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామంలోని కంటెపూడి శేషయ్యకు చెందిన బడ్డీకొట్టు తాళం పగులగొట్టి దొంగతనం చేసేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. కానీ తాళం పగులగొట్టడం వీలుకాకపోవడంతో వదిలి వెళ్లిపోయారు. గతంలో కూడా రోడ్డు మీద ఉన్న బడ్డీకొట్లలో చోరులు దొంగతనానికి పాల్పడి నగదును, కూల్‌డ్రింగ్ కేస్‌లను ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు.

రేపటి నుంచి డీసెట్ ధ్రువపత్రాల పరిశీలన

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 30 : డీసెట్-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనను ఆగస్టు 1 నుంచి 6వ తేదీ వరకు నగరంలోని డైట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందినవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 30 : నగరంలోని ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని సింధుప్రియా సెప్టెంబర్‌లో నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. గోవాలో జరిగిన 18వ జాతీయస్థాయి పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో విజేతగా నిలిచి స్వర్ణం సాధించింది. విద్యార్థినిని కళాశాల అధ్యాపకులు అభినందించారు.

పోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

ఖమ్మం లీగల్/ రఘునాథపాలెం, జూలై 30 : పదేండ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా జడ్జి కె.ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. రఘునాథపాలెం మండలం బూడిదంపాడు గ్రామానికి చెందిన గంగిశెట్టి రాకేశ్(20) 2022లో అదే ప్రాంతానికి చెందిన పదేండ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రఘునాథపాలెం పోలీసులు రాకేశ్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. దీనిపై కేసు సాక్ష్యాలు, వైద్య నివేదికలను పరిశీలించిన కోర్టు నేరం రుజువుకావడంతో రాకేశ్‌కు 20 ఏళ్ల జైలు, రూ.50 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు జీ హరీందర్‌రెడ్డి వాదించారు. ఈ కేసు విచారణకు కృషి చేసిన ఏసీపీలు ఆంజనేయులు, బస్వారెడ్డి, భరోసా లీగల్ ఆఫీసర్ ఎం.ఉమారాణి, కోర్టు కానిస్టేబుల్ రవికిషోర్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ బి రామ్మూర్తి, ఎస్ఐ కే శ్రీనివాసరావును సీపీ సునీల్ దత్ అభినందించారు.

'మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషి చేయాలి'

తిరుమలాయపాలెం, జూలై 30: మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని తిరుమలాయపాలెం ఎస్ఐ గిరధర్‌రెడ్డి కోరారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు.

ఇసుక లారీ సీజ్

ఎర్రుపాలెం, జూలై 30: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కీసర గ్రామం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీను ఎర్రుపాలెం పోలీసులు మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఎస్సై పీ.వెంకటేశ్ కథనం ప్రకారం.. TS04UE6966 అనే నెంబర్ గల లారీలో లారీడ్రైవర్ చల్లా నాగరాజు అనే వ్యక్తి అనుమతులు లేకుండా ఖమ్మం నగరానికి ఇసుక తరలిస్తున్నాడు. అతడి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేవు. దీంతో ఖమ్మానికి చెందిన లారీ యజమాని చలమల వెంకటేశ్వరరావు, కీసర గ్రామానికి చెందిన రావిచెట్టు వెంకట్రావు, లారీడ్రైవర్ చల్లా నాగరాజుపై కేసు నమోదు చేసి లారీ సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆశా వర్కర్ల అరెస్ట్

కారేపల్లి : ఆందోళన చేస్తున్న ఆశాలు

వైరాటౌన్, జూలై 30 : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తున్న ఆశా వర్కర్లు శైలజ, రేణుక, మల్లేశ్వరి, ఆదికుమారిలను పోలీసులు అరెస్ట్ చేసి వైరా పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. అనంతరం వారిని విడుదల చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆశావర్కర్ల అక్రమ అరెస్టు అమానుషం

కారేపల్లి, జూలై 30 : తమ సమస్యల పరిష్కారం కోసం ఛలోహైదరాబాద్ కార్యక్రమానికి ఆశా గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు హైదరాబాద్ వెళ్తున్న ఆశా వర్కర్లను, గ్రామపంచాయతీ కార్మికులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీఐటీయూ మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా మంగళవారం ఆశాలు, గ్రామపంచాయతీ కార్మికులు కారేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ సింగరేణి మండల కన్వీనర్ కే.నరేంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ జిల్లా నాయకురాలు ఎల్లబోయిన రాధ, మండల అధ్యక్ష, కార్యదర్శులు జంగా కల్యాణి, వాంకుడోతు కమల, సుజాత, మేదర కుమారి, బుచ్చమ్మ, కృష్ణమ్మ, ఎస్.కే.హుస్సేన్, నాగేశ్వరరావు, బోల కొమరయ్య పాల్గొన్నారు.

'ఆశాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి'

మధిర రూరల్, జూలై 30: ఆశాల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు శీలం నర్సింహారావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో జరిగే ధర్నాకు మండలానికి చెందిన పలువురు ఆశా వర్కర్లను పోలీసులు వెళ్లనీయలేదు. వారిని అరెస్ట్ చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆశాలు సీఐటీయూ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

బల్లేపల్లి మత్స్య సొసైటీ ఎన్నిక

రఘునాథపాలెం, జూలై 30 : ఖమ్మం నగరం బల్లేపల్లి మత్స్య సహకార సొసైటీ ఎన్నిక మంగళవారం బల్లేపల్లిలో జరిగింది. సంఘం అధ్యక్షుడిగా గొడుగు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా జాల రామయ్య, ప్రధాన కార్యదర్శిగా గంటా నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు మరో ఆరుగురిని డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

రఘునాథపాలెం, జూలై 30 : వ్యక్తి అదృశ్యంపై ఖానాపురం హవేలీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ భానుప్రకాశ్ తెలిపిన ప్రకారం.. ఖమ్మం నగరం టేకులపల్లిలోని కేసీఆర్ డబుల్ బెడ్రూమ్‌కు చెందిన దేవర దిలీప్‌కుమార్ నగరంలోని తిరుమల మిల్క్‌లో మార్కెటింగ్ చేస్తుంటాడు. ఈ నెల 26వ తేదీన డ్యూటీకి వెళ్లిన దిలీప్‌కుమార్ తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య శిరీష మంగళవారం పోలీసులను ఆశ్రయించింది.

మల్లారంలో రుణమాఫీ సంబురాలు

మధిర రూరల్, జూలై 30: మండలంలోని మల్లారం రైతువేదికలో స్థానిక వ్యవసాయ అధికారుల రుణమాఫీ సంబురాలను మంగళవారం నిర్వహించారు. రెండో రుణమాఫీ కార్యక్రమాన్ని సీఎం హైదరాబాద్ ప్రారంభించే దృశ్యాలను రైతువేదికలోని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఇక్కడి రైతులు వీక్షించారు.

'మండలస్థాయి క్రీడలను విజయవంతం చేయాలి'

మధిర, జూలై 30: త్వరలో జరిగే మండల స్థాయి క్రీడాపోటీలను విజయవంతం చేయాలని ఎంఈవో వై.ప్రభాకర్ సూచించారు. మండల స్థాయి క్రీడాపోటీల నిర్వహణ కోసం మధిర టీవీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, పీడీలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

మార్కెట్లోకి టీవీఎస్ కొత్త బైక్


టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ బైక్‌ను ఆవిష్కరిస్తున్న షోరూం అధినేత రాంబాబు

రఘునాథపాలెం, జూలై 30: ఖమ్మంజిల్లా కేంద్రంలోని రంగరాయ టీవీఎస్ షోరూం ఖమ్మం మార్కెట్లోకి మరో నూతన బైక్‌ను తీసుకొచ్చింది. టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ పేరుతో వచ్చిన కొత్త బైక్ ఆవిష్కరణ మంగళవారం షోరూంలో అట్టహాసంగా జరిగింది. దీనికి టీవీఎస్ టెరిటర్ మేనేజర్ సునీల్, షోరూమ్ అధినేత మరిపూడి రాంబాబు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ఆవిష్కరించారు. యువతను ఆకర్షించేలా 160 సీసీతో రెండు సరికొత్త మోడళ్లను తీసుకొచ్చినట్లు వారు తెలిపారు.

శుభకార్యాలకు, విహారయాత్రలకు అద్దె బస్సులు

ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మీ

కల్లూరు బస్టాండ్ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎం రాజ్యలక్ష్మీ

సత్తుపల్లి, జూలై 30 : వివాహాది శుభకార్యాలు, విహారయాత్రలకు, ఇతర అవసరాలకు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సులు ఇవ్వనున్నట్లు డీఎం యు.రాజ్యలక్ష్మీ తెలిపారు. మంగళవారం కల్లూరు బస్టాండ్‌ను సందర్శించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఖమ్మం రోడ్డులో మూడు డీలక్స్ బస్సులను అదనంగా నడుపుతున్నట్లు ఆమె తెలిపారు. డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు గిఫ్ట్ బాక్స్‌లు ఏర్పాటు చేశామని, తమ ప్రయాణం పూర్తయిన తర్వాత టికెట్ వెనుక ఫోన్‌నెంబర్ రాసి బాక్స్‌లో వేసినట్లైతే ప్రతి 15 రోజుల కొకసారి లక్కీ డ్రా తీసి బహుమతులు అందించనున్నట్లు ఆమె తెలిపారు. గురువారం కల్లూరు బస్టాండ్‌లో జరిగే వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటే ప్రదేశాన్ని పంచాయతీ ఈవో నాగేశ్వరరావుతో కలిసి పరిశీలించారు.

విద్యార్థులకు జ్ఞాపకశక్తి మెళకువలపై శిక్షణ

కారేపల్లి, జూలై 30 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెంచుకోవడానికి మెళకువలపై మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యులు ఎం.సింహాచలం సూచనల మేరకు అధ్యాపక బృందం ఓ ప్రణాళిక తయారు చేశారు. అనంతరం సీనియర్ అధ్యాపకులు వేణు మాట్లాడుతూ ఆహారం, వ్యాయామం, క్రమశిక్షణ ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుదలకు తోడ్పడుతాయని తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల ఇంటింటి సర్వే..

ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న అధికారులు

పెనుబల్లి, జూలై 30: పెనుబల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఎంపీడీవో అన్నపూర్ణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్యసిబ్బంది గ్రామంలో మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. బీసీ కాలనీలో హెల్త్‌క్యాంపు నిర్వహించి అవసరమైన వారికి చికిత్సలు నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్యంపై పలు సూచనలు అందించారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హెల్త్‌సూపర్‌వైజర్ పొట్టమ్మ, నిర్మలకుమారి, బషీరుదీదన్, ఎంఎల్‌హెచ్‌పీ అలేఖ్య, హెల్త్‌అసిస్టెంట్ కరీముల్లా, కృష్ణకుమారి, రాణి, పంచాయతీ సెక్రటరీ ప్రసాద్, ఆశాకార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తుపల్లిటౌన్, జూలై 30 : సత్తుపల్లి ఐపీడీఎస్ 33/111 కే.వీ. సబ్‌స్టేషన్ పరిధిలోని సిద్దారాంరోడ్డు, వీటీఆర్‌రోడ్డు, లెనిన్‌రోడ్డు, తుమ్మూరు రామారావురోడ్డు, శ్రీనివాసటాకీస్ రోడ్డు, పాలవాడ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ సత్తుపల్లి పట్టణ ఏఈ తెలిపారు.

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్ రద్దు చేయాలి

పెనుబల్లి, జూలై 30 : కల్లూరు మండలం పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు శిరీష సస్పెన్షన్‌ను రద్దు చేయాలంటూ మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో కల్లూరు ఎంపీడీవో, తహసీల్దార్, ఆర్డీవోకు వినతిపత్రాలు అందజేశారు. టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, కమిటీ కార్యకర్తలు సుమారు 30 మంది ఉపాధ్యాయులు సంఘీభావం తెలిపి శిరీష సస్పెన్షన్‌ను రద్దు చేసి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ

పెనుబల్లి, జూలై 30 : మండలంలోని అడవిగంగిదేవిపాడు ఎంపీయూపీఎస్, తల్లంపాడు ఎంపీపీఎస్, కొమ్ముగూడెం ఎంపీపీఎస్, పెరుమాళ్లకుంట ఎంపీయూపీఎస్, బ్రహ్మాలకుంట ఎంపీపీఎస్, కర్లపాడు ఎంపీయూపీఎస్ పాఠశాలల్లో విద్యార్థులకు మిట్టపల్లి వెంకటరామారావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు నరేంద్రకుమార్, సోదరులు రూ.10 వేలు విలువ చేసే నోట్‌పుస్తకాలను మంగళవారం అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

సత్తుపల్లిటౌన్, జూలై 30 : స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ విశ్వవిద్యాలయం దూర విద్య అభ్యసన సహాయ కేంద్రంలో 2024-25 సంవత్సరానికి గాను డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కేంద్రం సమన్వయకర్త పల్లా శ్రీనివాస్ తెలిపారు. సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆగస్టు 18లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్మీడియట్ సైన్స్, గణితం గ్రూపులు చదివిన విద్యార్థులు అర్హులని తెలిపారు. వివరాలకు 7382929742 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

సత్తుపల్లి, జూలై 30 : కల్లూరు మండలంలోని మర్లపాడు యూపీఎస్ పాఠశాలకు మంగళవారం ఆసిఫాబాద్ ఆర్టీవో శంకర్‌నాయక్ బీరువా, కుర్చీలు, 65 మంది విద్యార్థులకు బ్యాగులు, బెల్ట్‌లు పంపిణీ చేశారు.

'సాగునీరు విడుదల చేయాలి'

వైరాటౌన్, జూలై 30: వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాలని, సాగర్ జలాలతో నింపాలని తెలంగాణ రైతు సంఘం, వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

దెందుకూరు పీహెచ్‌సీ సీహెచ్‌వోగా వెంకటేశ్వర్లు

మధిర రూరల్, జూలై 30: మధిర మండలంలోని దెందుకూరు పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా మధిరకు చెందిన వడ్లమూడి వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పృధ్వీరాజ్ ఆధ్వర్యంలో ఆయన విధుల్లో చేరారు. బదిలీల్లో భాగంగా కొత్తగూడెం జిల్లా నుంచి జూలూరుపాడు పీహెచ్‌సీ నుంచి బదిలీపై ఈయన ఇక్కడికి వచ్చారు. అదేవిధంగా హెల్త్ విజిటర్‌గా ముదిగొండ పీహెచ్‌సీ నుంచి బీ.సరోజిని ఇక్కడ విధుల్లో చేరారు.

మహిళ ఆత్మహత్య

మామిళ్లగూడెం, జూలై 30 : అనారోగ్య కారణాలతో మానసికంగా ఇబ్బందులకు గురవుతున్న ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం ఖమ్మం నగరంలో చోటుచేసుకున్నది. ఖమ్మం ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాకబండబజార్ జంగాలకాలనీకి చెందిన పస్తం జ్యోతి(28) ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరెతో ఉరి వేసుకుంది. జ్యోతి తండ్రి సిరిగిరి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సీఐ ఉదయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోడ మీద నుంచి కిందపడి వ్యక్తి మృతి

మామిళ్లగూడెం, జూలై 30 : ప్రమాదశావత్తు గోడ మీద నుంచి కిందపడి వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గార్ల బయ్యారం మండలం బర్లగూడెం తండాకు చెందిన భూక్యా రాము రోజువారి కూలీగా నగరానికి వచ్చాడు. అతిగా మద్యం తాగే అలవాటు ఉన్న ఆయన సోమవారం ఉదయం కూలీ పని లేకపోవడంతో మద్యం తాగి పాత బస్టాండ్ వద్ద ప్రహరీ మీద కూర్చున్నాడు. ఒక్కసారిగా అదుపు తప్పి కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే ఉన్న పండ్ల వ్యాపారులు 108 ద్వారా రామును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు భూక్యా సిద్ధార్థ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలలో 'తిథి' భోజన కార్యక్రమం

ఎర్రుపాలెం, జూలై 30: మండలంలోని వెంకటాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 'తిథి' భోజన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో చేపట్టారు.